



TGTEL/26/A2235

వాస్తవాలు పలుకు

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 04 | 15-05-2026 శుక్రవారం | పేజీలు: 04 | వెల: 3/-


## రైతును వంచించే 'తరుగు' దోపిడీని అరికట్టాలి: ఎమ్మెల్యే వేముల




03

# నీట్ పేపర్ లీక్‌పై పారదర్శక విచారణ జరపాలి

**నీట్ పరీక్ష రద్దు అంశంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**
**పేపర్ లీక్ ఘటనపై సమగ్ర, పారదర్శక విచారణకు డిమాండ్**
**లక్షలాది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని ఆవేదన**
**దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం**
**పరీక్షల విశ్వసనీయతను కాపాడాలని కేంద్రానికి సూచన**
**పేపర్ లీక్ మాఫియాపై కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్య**
**విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**
**పోటీ పరీక్షలు అవకాశాల వేదికగా ఉండాలని సూచన**
**బీజేపీ, బీఆర్ఎస్‌లపై సీఎం తీవ్ర విమర్శలు**
**పరీక్షల నిర్వహణలో వైఫల్యాలపై రాజకీయ విమర్శలు గుప్పించిన సీఎం**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. పేపర్ లీక్ ఘటనపై సమగ్రంగా, పారదర్శకంగా విచారణ జరపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటన వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ పరిణామంతో దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల శ్రమ, కృషి వృథా కాకుండా ఉండాలంటే పరీక్షల నిర్వహణలో విశ్వసనీయత అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.
ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున కేంద్రానికి పలు సూచనలు చేసినట్లు సీఎం తెలిపారు. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచాలని, పేపర్ లీక్ ఘటనలకు అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.
పేపర్ లీక్ మాఫియాపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులు మళ్లీ ఇలాంటి పరిస్థితుల వల్ల ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు

..మిగతా 2లో

# ఆస్ట్రేలియా హైకమిషనర్‌తో కేటీఆర్ కీలక భేటీ

పెట్టుబడులు, ఐటీ సహకారంపై విస్తృత చర్చ
కేటీఆర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం
ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ పాల్గొన్న భేటీ
కర్ణాటక, తెలంగాణ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ హాజరు
పరస్పర పెట్టుబడుల అవకాశాలపై విస్తృత చర్చ
ఐటీ రంగంలో సహకారంపై ప్రత్యేక దృష్టి
హైదరాబాద్ టెక్ ఎకోసిస్టమ్‌పై కేటీఆర్ వివరణ
గ్రీన్ ఎనర్జీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు
విద్యా రంగంలో కొత్త ఒప్పందాలపై చర్చ
యువతకు అంతర్జాతీయ అవకాశాలపై అభిప్రాయాలు
భారత్-ఆస్ట్రేలియా సంబంధాల బలోపేతంపై ఆశాభావం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కల్వకుంట్ల తారక రామారావుతో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ భేటీ అయ్యారు. నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో ఇరుపక్షాల మధ్య పరస్పర సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.
ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ కూడా సమావేశంలో పాల్గొన్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా

..మిగతా 2లో

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



**యాసంగి సీజన్‌లో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం**
**రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా**
**కూసుమంచి మండలం పాలేరులో కొనుగోలు కేంద్రం పరిశీలన**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారుల సమీక్ష**
**ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం**
**రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం రవాణా వ్యవస్థ బలోపేతానికి చర్యలు**
**బిహార్, పశ్చిమ బెంగాల్ నుంచి హమాలీలు రానందున కొరత**
**కలెక్టర్లకు లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు**
**కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు సూచనలు**
**రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం ఉండదని స్పష్టం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వరి రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ కొనుగోలు విధానం పట్ల పూర్తి విశ్వాసంతో ఉండాలని రైతులకు

..మిగతా 2లో


# పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

**ఆందోళనల్లో అన్నదాతలు**
**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**
**వరి, మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**
**రైతులు రోజువారీగా ఆందోళనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్య**
**ఇప్పటివరకు 40 శాతం కూడా కొనుగోళ్లు జరగలేదని ప్రశ్న**
**నిర్మల్ జిల్లాలో రైతు ధర్నాలో పాల్గొన్న బీజేపీ నేత**
**అకాల వర్షా లతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన**
**కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందుల్లోకి నెట్టబడ్డారని ఆరోపణ**
**గన్నీ సంచుల సరఫరా కూడా సరిగా లేకపోవడం విమర్శకు కారణం**
**తడిసిన ధాన్యాన్ని పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్**
**తేమ, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ**
**రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సూచన**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
వరి, మొక్కజొన్న, జొన్న పంటల కొనుగోళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పంటల కొనుగోలు ప్రక్రియ సకాలంలో జరగకపోవడంతో రైతులు ప్రతిరోజూ ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు.గురువారం నిర్మల్ జిల్లాలో జరిగిన రైతు ధర్నాలో

..మిగతా 2లో



## ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

**మే 30 నుంచి మూడో దశ సర్ ప్రక్రియ**
**ఏపీ, తెలంగాణ షెడ్యూల్ ఖరారు**
**16 రాష్ట్రాలు,**
**3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభం**
**36.73 కోట్ల మంది ఓటర్ల డేటా పరిశీలన**
**ప్రక్రియలో 3.94 లక్షల మంది అధికారులు**
**ఏపీలో జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే**
**సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల**
**తెలంగాణలో జూన్ 25 నుంచి షురూ**
**అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల ఫైనల్ లిస్ట్ ప్రకటన**
**పారదర్శకత కోసం బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి ఈసీ ఆదేశం**
**జమ్ముకశ్మీర్, హిమాచల్, లద్ధాఖ్‌లలో వాయిదా పడ్డ షెడ్యూల్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా మూడో దశకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటరు జాబితాను సర్వసమగ్రంగా, తప్పులు లేకుండా రూపొందించడమే లక్ష్యంగా మే 30వ తేదీ నుంచి ఈ ప్రక్రియను దశలవారీగా చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మూడో దశలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి మొత్తం 16 రాష్ట్రాలు మరియు మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఓటర్ల వివరాల నమోదులో పారదర్శకతను పెంచేందుకు, అనర్హుల తొలగింపునకు

..మిగతా 2లో

# గవర్నర్ వాహనాల కుదింపు

ఇంధన పొదుపు దిశగా నిర్ణయం
ప్రధాని మోదీ పిలుపును ఆచరిస్తున్న తెలంగాణ గవర్నర్
తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్య తగ్గించాలన్న నిర్ణయం
లోక్ భవన్‌లో ఇప్పటికే సగం వాహనాలు తగ్గించినట్లు వెల్లడి
ఇంధన పొదుపు చర్యలకు పూర్తిగా మద్దతు ప్రకటించిన గవర్నర్
ఖర్చుల నియంత్రణకు ఈ చర్యలు ఉపయోగపడతాయని వ్యాఖ్య
సీఎం, మంత్రులు, అధికారులు కూడా పాటించాలని సూచన
ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని అనుసరించాలని పిలుపు
పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాల సూచన
ఇంధన వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యమని స్పష్టం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో దేశంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపును తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ఆచరిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తన అధికారిక కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని

..మిగతా 2లో



# బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

**రెండు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయన్న న్యాయవాది**
**హైకోర్టులో ఉత్కంఠభరిత వాదనలు**
**భగీరథ్ తరపున వాదించిన నిరంజన్ రెడ్డి**
**పోక్సో చట్టం వర్తించదంటూ కోర్టుకు వివరణ**
**సీల్డ్ కవర్‌లో ఆధారాలు సమర్పిస్తామని ప్రకటన**
**మీడియా ట్రయల్స్ జరుగుతున్నాయంటూ ఆరోపణలు**
**వాల్ పోస్టర్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం అన్న వాదన**
**మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టును కోరిన భగీరథ్ తరపు**
**మధ్యంతర రక్షణపై రేపటికి ఉత్తర్వులు**
**ముందస్తు బెయిల్ విచారణ వచ్చే వారానికి వాయిదా**




02

# నీట్ పేపర్ లీక్‌పై పారదర్శక విచారణ జరపాలి

**మొదటిపేజీ తరువాయి**

చేయాలని ఆయన సూచించారు. పోటీ పరీక్షలు విద్యార్థులకు అవకాశాల వేదికగా ఉండాలని, కానీ వారి జీవితాలను నాశనం చేసే పరిస్థితి రాకూడదని సీఎం అన్నారు. పరీక్షల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో, రాష్ట్రంలో పరీక్షల నిర్వహణలో జరుగుతున్న వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనలపై రెండు పార్టీల వైఖరిని ఆయన ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల మధ్య ఈ విషయంలో పెద్ద తేడా లేదంటూ విమర్శలు గుప్పించారు. మొత్తంగా నీట్ యూజీ వివాదం నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం ఫెయిల్

**మొదటిపేజీ తరువాయి**

పాల్గొన్న ఆయన, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు కనీసం 40 శాతం కూడా పంటల కొనుగోళ్లు జరగలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు.

అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలకు, వాస్తవ పరిస్థితికి పొంతన లేదని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఆత్మహత్యల వరకు వెళ్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతు కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, గన్నీ సంచులు కూడా సరఫరా చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల లోపం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమ, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ, వెంటనే సమగ్ర కొనుగోలు వ్యవస్థను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత డిమాండ్ చేశారు.



# బండి భగీరథ్ కేసులో బాధితురాలు మైనర్ కాదు

- **రెండు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లు ఉన్నాయన్న న్యాయవాది**
- **హైకోర్టులో ఉత్కంఠభరిత వాదనలు**
- **భగీరథ్ తరపున వాదించిన నిరంజన్ రెడ్డి**
- **పోక్సో చట్టం వర్తించదంటూ కోర్టుకు వివరణ**
- **సీల్డ్ కవర్‌లో ఆధారాలు సమర్పిస్తామని ప్రకటన**
- **మీడియా ట్రయల్స్ జరుగుతున్నాయంటూ ఆరోపణలు**
- **వాల్ పోస్టర్లు, సోషల్ మీడియాలో దుష్ప్రచారం అన్న వాదన**
- **మధ్యంతర రక్షణ కల్పించాలని కోర్టును కోరిన భగీరథ్ తరపు**
- **మధ్యంతర రక్షణపై రేపటికి ఉత్తర్వులు**
- **ముందస్తు బెయిల్ విచారణ వచ్చే వారానికి వాయిదా**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్కు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టులో గురువారం వాడివేడి వాదనలు జరిగాయి. భగీరథ్ తరపున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కీలక వాదనలు వినిపించారు. ఈ కేసులో బాధితురాలు అసలు మైనర్ కాదని, అందువల్ల పోక్సో చట్టం వర్తించదని కోర్టుకు తెలిపారు. గతంలో బాధితురాలిపై నమోదైన మరో కేసులో పోలీసులు కోర్టుకు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో ఆమెను మేజర్‌గా పేర్కొన్నారని వాదించారు.

బాధితురాలికి సంబంధించి రెండు వేర్వేరు జనన తేదీ ధ్రువపత్రాలు ఉన్నాయని, వాటిలో పుట్టిన తేదీలు భిన్నంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో మరో తేదీని ప్రస్తావిస్తున్నారని, అసలు ఏ తేదీ సరైందో కోర్టే నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. భగీరథ్ నిర్దోషి అని నిరూపించే పలు ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని సీల్డ్ కవర్‌లో సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కోర్టుకు వెల్లడించారు. ఈ ఆధారాలను సమర్పించే అవకాశం ఇవ్వాలని కోరారు.

భగీరథ్ ఎలాంటి ప్రత్యేక హక్కులు కోరడం లేదని, అయితే ఈ కేసును సాధారణ కేసుల మాదిరిగా చూడకూడదని నిరంజన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భగీరథ్ తండ్రి కేంద్ర మంత్రిగా ఉండటంతో రాజకీయ, సామాజిక ఒత్తిడులు తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వాల్ పోస్టర్లు, మెట్రో రైళ్లలో ప్రచారాలు చేస్తూ భగీరథ్‌ను దోషిగా చిత్రీకరిస్తున్నారని, సోషల్ మీడియా ద్వారా కూడా దుష్ప్రచారం సాగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయకముందే మీడియా ట్రయల్స్ ద్వారా నిందితుడిని శిక్షించే ప్రయత్నం జరుగుతోందని వాదించారు. భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పిస్తే విచారణకు పూర్తిగా సహకరిస్తారని, తమ వద్ద ఉన్న సాక్ష్యాలను పోలీసుల ముందుంచేందుకు అవకాశం కల్పించాలని కోర్టును కోరారు. మధ్యంతర రక్షణ లేకపోతే ముందస్తు బెయిల్ పిటిషన్ ప్రయోజనం లేకుండా పోతుందని, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కోల్పోతారని తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు భగీరథ్‌కు మధ్యంతర రక్షణ కల్పించే అంశంపై ఉత్తర్వులను శుక్రవారానికి వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# ఆస్ట్రేలియా హైకమిషనర్‌తో కేటీఆర్ కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి**

దృష్టి సారించారు.

తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ముఖ్యంగా ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో సహకారంపై ఇరు పక్షాలు చర్చించాయి. హైదరాబాద్ కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ఎకో సిస్టమ్‌పై హైకమిషనర్ బృందానికి కేటీఆర్ వివరించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో తెలంగాణ తీసుకుంటున్న చర్యలను కేటీఆర్ వివరించినట్లు సమాచారం. విద్యారంగంలో కొత్త భాగస్వామ్యాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. భారత్–ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన ద్వైపాక్షిక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలపై ఇరుపక్షాలు అభిప్రాయాలు పంచుకున్నాయి. యువతకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే దిశగా ఈ భాగస్వామ్యం కీలకంగా మారుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ భేటీ ద్వారా భవిష్యత్తులో తెలంగాణ–ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తమైంది. సమావేశం అనంతరం కేటీఆర్ ఈ చర్చలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.



# ఓటరు జాబితా ప్రక్షాళనకు రంగం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**


ఈ సవరణ ప్రక్రియ దోహదపడనుంది. అయితే, మంచు కురిసే హిమాలయ ప్రాంతాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్ మరియు లద్దాఖ్‌లలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, అక్కడ మాత్రం షెడ్యూల్‌ను తర్వాత వెల్లడిస్తామని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఈ మూడో దశ సవరణ ప్రక్రియలో దాదాపు 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా సుమారు 3.94 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు రంగంలోకి దిగనున్నారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల పేర్లు, చిరునామాలు, వయస్సు వంటి వివరాలను స్వయంగా తనిఖీ చేస్తారు. ఈ ప్రక్రియలో అధికారులు ఎటువంటి పక్షపాతం లేకుండా పని చేసేలా చూసేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కూడా ఈసీ కోరింది. రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ లెవల్ ఏజెంట్లు ఈ తనిఖీల్లో అధికారులకు తోడుగా ఉండి, జాబితాలో ఉండాల్సిన అసలైన ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద తప్పనిసరిగా ఏజెంట్లను ఉంచాలని, తద్వారా జాబితా రూపకల్పనలో రాజకీయ పక్షాల అభ్యంతరాలకు ఆస్కారం లేకుండా చూడాలని ఎన్నికల సంఘం పార్టీలకు దిశానిర్దేశం చేసింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విషయానికొస్తే, ఇక్కడ జూన్ 15వ తేదీ నుంచి జులై 14వ తేదీ వరకు నెల రోజుల పాటు బీఎల్ఓలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారు. ఈ తనిఖీలు పూర్తయిన తర్వాత జులై 21న ముసాయిదా జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై ఎవరికైనా ఫిర్యాదులున్నా, కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నా లేదా తప్పులను సరిదిద్దుకోవాలన్నా ఆగస్టు 20 వరకు గడువు ఉంటుంది. వచ్చిన అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించి, సెప్టెంబర్ 22వ తేదీన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పక్కాగా ఉన్న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తారు. అలాగే అరుణాచల్ ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో కూడా ఇదే షెడ్యూల్ అమలు కానుంది.

తెలంగాణలో ఓటర్ల వివరాల పరిశీలన ప్రక్రియ జూన్ 25న ప్రారంభమై జులై 24 వరకు కొనసాగుతుంది. ఒక నెల రోజుల పాటు సాగే ఈ ఇంటింటి సర్వే అనంతరం, జులై 31న ముసాయిదా జాబితాను బహిర్గతం చేస్తారు. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పంజాబ్ రాష్ట్రంలోనూ ఇదే కాలక్రమం అనుసరిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర, దిల్లీ వంటి ఇతర పెద్ద రాష్ట్రాల్లో జూన్ 30న సర్వే మొదలై అక్టోబర్ 7న తుది జాబితా వెలువడనుంది. నాగాలాండ్, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాల్లో వేర్వేరు తేదీల్లో ఈ ప్రక్రియ జరగనుండగా, డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీ లక్ష్యంగా పెట్టుకుంది.

దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లలో మెజారిటీ ఓటర్ల వివరాల సేకరణ ఇప్పటికే పూర్తయినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి 13 ప్రధాన రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొదటి రెండు దశల కింద ఓటర్ల సవరణ ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. ఇప్పటి వరకు జరిగిన ఈ కసరత్తులో సుమారు 59 కోట్ల మంది ఓటర్ల డేటాను పరిశీలించి సవరించారు. ఆయా దశల్లో 6.3 లక్షల మంది బీఎల్ఓలు, 9.2 లక్షల మంది బీఎల్ఏలు పాలుపంచుకుని భారీ స్థాయిలో ఓటరు కార్డుల అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. తాజాగా ప్రకటించిన మూడో దశతో దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఓటరు జాబితా ప్రక్షాళన పూర్తి కానుంది, ఇది రాబోయే ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించనుంది.



# గవర్నర్ వాహనాల కుదింపు



**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయం తీసుకున్నారు.

ప్రధాని సందేశానికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన గవర్నర్, వాహనాల వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాన్ని తాము ఇప్పటికే అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్ భవన్ (లోక్ భవన్)లో సైతం సగం వాహనాలను తగ్గించినట్లు ఆయన వెల్లడించారు. వాహనాల సంఖ్య తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని, పరిపాలనలో ఇంధన వినియోగాన్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, అధికారులు కూడా ప్రధాని మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు సందేశాన్ని అమలు చేయాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల కోరారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం ఈ దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు.

అలాగే రాష్ట్ర ప్రజలు కూడా ప్రధాని విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ఇంధన వినియోగాన్ని తగ్గించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చిన్న చిన్న మార్పులతో పెద్ద స్థాయిలో ఇంధన పొదుపుకు సహకరించవచ్చని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఈ అంశంపై అవగాహన కల్పించాలని గవర్నర్ సూచించారు. విద్యార్థుల్లో ఇంధన పొదుపు అలవాట్లను పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా ప్రధాని మోదీ పిలుపు దేశవ్యాప్తంగా అమలవుతున్న నేపథ్యంలో, తెలంగాణ గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం పరిపాలనలో ఇంధన పొదుపు దిశగా మరో అడుగుగా భావించబడుతోంది.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**



ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ రోజు కూసుమంచి మండలం పాలేరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల పనితీరు, ధాన్యం సేకరణ ప్రక్రియ, రవాణా వ్యవస్థ, నిల్వ సదుపాయాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో సుమారు 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి నేరుగా ధాన్యం సేకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రధానంగా ఎదురవుతున్న ట్రాన్స్‌పోర్ట్, హమాలీల సమస్యలను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ధాన్యం సేకరణకు ఎలాంటి ఆటంకం లేకుండా వ్యవస్థను సరిచేస్తున్నామని వివరించారు. హమాలీల కొరత సమస్యపై మాట్లాడుతూ బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి ఎక్కువ సంఖ్యలో హమాలీలు తెలంగాణకు వస్తారని తెలిపారు. అయితే ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రక్రియ కారణంగా అక్కడి నుంచి హమాలీల రాక తగ్గిందని, దీంతో కొంత కొరత ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.

ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ధాన్యం రవాణా కోసం అవసరమైన లారీలు, డీసీఎంలను తక్షణమే సమకూర్చాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండకుండా వేగంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ధాన్యం తూకం, కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. తాగునీరు, నీడ, నిల్వ సౌకర్యాలు వంటి అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.



# ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ బడిబాట

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి 9 వార్త న్యూస్ )**

ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్‌కు చెందిన అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఆదిలాబాద్ సిబ్బంది ముక్రా (బి) గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి పాఠశాలలో అందిస్తున్న విద్యా సౌకర్యాలు, హాస్టల్ వసతి, క్రమశిక్షణతో కూడిన అభ్యాస వాతావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సి ఆర్ టి రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి స్థాయి హాస్టల్ వసతి, మెరుగైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అనాథలు, అర్ధానాథలు, వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు, సంచార జాతుల పిల్లలు మరియు బీపీఎల్ కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాఠశాలలో చేరాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ప్రత్యేక అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాలలో ప్రవేశాల కోసం ఆసక్తి గల వారు 8500023457, 9705108585 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. స్థలం: అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, పాత కేంద్రీయ విద్యాలయ భవనం, ఆదిలాబాద్.



# హంగర్గ గ్రామంలో హనుమాన్ ఆలయ పునః ప్రారంభ భూమి పూజ

- ముఖ్యఅతిథి గౌరవనీయులు శ్రీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**నిజామాబాద్ పోతంగల్ మే 14 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలో గురువారం రోజున హనుమాన్ మందిరం పున ప్రారంభ భూమి పూజ కోసం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సల హాదారులు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గారు, టీపి సీసీ అధ్యక్షులు శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి గారు, ముఖ్య అతిథులుగా పాల్గొన డం జరిగింది ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరడి గంగాధర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు కలిసికట్టుగా, నిలబడి, హనుమాన్ మందిరం నూతనంగా కట్టుకోవడానికి, ట్రాక్టర్ యజమాన్యం తరపున 18 నుండి 20 లక్షలు జమ చేయడం జరిగిందని సర్పంచ్ వెల్లడించ డం జరిగింది. మరియు గ్రామ ప్రజలు పెద్దలు దాతలు అందరూ కలిసి కొన్ని జమ చేసుకొని, ప్రారంభిస్తున్నామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు మాజీ మండల అధ్య క్షుడు ఎజాజ్ ఖాన్ స్థానిక ,సర్పంచ్ , ఉదయ్ భాస్కర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరడి గంగాధర్ ,ఎమ్మార్వో విష్ణు ,ఎంపీడీవో చందర్, పోతంగల్ మండల నాయకులు, గ్రామ ప్రజలు పెద్దలు తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది.







# హెచ్‌పీవీ టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

**నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

మహిళల్లో ప్రాణాంతకమైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా సమర్థవంతంగా అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక మాలపల్లి, అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని మత పెద్దలు, డివిజన్ కార్పొరేటర్లకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. హ్యూమన్ పాపిల్లోమా వైరస్ కారణంగా వచ్చే ఈ క్యాన్సర్ భారత్‌లో మహిళలను వేధిస్తున్న రెండో అతిపెద్ద ఆరోగ్య సమస్య అని ఆందోళన వ్యక్తం చేశారు. 2006 నుంచే ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ టీకా 93 నుంచి 100 శాతం వరకు రక్షణ కల్పిస్తుందని, ఇప్పటికే 160 దేశాల్లో 50 కోట్ల మంది బాలికలకు దీనిని పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రస్తుతం 14 ఏళ్లు నిండి 15వ ఏట ప్రవేశించిన బాలికలకు 'గార్డాసిల్ 4' అనే టీకాను ఒకే మోతాదులో (0.5 ఎం.ఎల్) అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ టీకాపై ప్రజల్లో ఉన్న అపోహలను ఆమె కొట్టిపారేశారు. సంతానోత్పత్తిపై గానీ, నెలసరి ఋతుచక్రంపై గానీ ఈ వ్యాక్సిన్ ఎటువంటి ప్రభావం చూపదని, కేవలం రోగనిరోధక శక్తిని పెంచుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ సల్మా తహసీన్ మాట్లాడుతూ.. మైనార్టీ ప్రాంతాల్లోని అర్హులైన ప్రతి బాలికకు టీకా అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, డాక్టర్ అజ్మల్ తదితరులు టీకా ప్రాముఖ్యతను వివరించగా, ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సికందర్ నాయక్, పలువురు కార్పొరేటర్లు, మత పెద్దలు మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బషీరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా 'బడిబాట'

**నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం విద్యార్థుల కోలాహలంతో సందడిగా మారింది. పదవ తరగతి ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన 16 మంది విద్యార్థులను గ్రామ పంచాయతీ పాలకవర్గం ఘనంగా సత్కరించింది. సర్పంచ్ బైకని జమున మహేష్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందనలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఇంతటి ప్రతిభ కనబరచడం గర్వకారణమని, విద్యార్థులు ఇదే పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన గ్రామ పంచాయతీ పాలకవర్గానికి పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు జరపాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

సాలూర మండలం హున్సా గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ నవాజ్, ఎంపీడీఓ శ్రీనివాస్ సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని, కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన నీడ మరియు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం తగ్గెల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులతో పాటు ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న నర్సరీని ఎంపీడీఓ తనిఖీ చేశారు. రాబోయే వర్షాకాలం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను సిబ్బంది తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో పారిశుధ్య పనుల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ పర్యటనలో పీఏసీసీఎస్ సీఈఓ హన్మంత్ రావు, వైస్ చైర్మన్ వినోద్ బాబా, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# క్షయ రహిత సమాజమే లక్ష్యం

**నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో క్షయ నియంత్రణ విభాగం సిబ్బంది పనితీరు, లక్ష్యాల సాధనపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని యూనిట్ల వారీగా కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను త్వరితగతిన ముగించాలని సూచించారు. ముఖ్యంగా ఆర్మూర్, బోధన్ ప్రాంతాల్లో పెండింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని, వీటిని నెల రోజుల్లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల వారీగా ప్రత్యేకంగా క్షయ నిర్ధారణ శిబిరాలను ఏర్పాటు చేసి నూతన కేసులను గుర్తించాలని, ఈ ప్రక్రియలో సర్పంచుల సహకారం తీసుకోవాలని కోరారు. నిజామాబాద్ నగరంలో డివిజన్ల వారీగా శిబిరాల నిర్వహణకు పక్కా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ శిబిరాల్లో కేవలం క్షయ పరీక్షలే కాకుండా హెచ్ఐవీ, బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి ఇతర పరీక్షలను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో క్షయ రహిత గ్రామాల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, డీహెచ్ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, డీపీసీ లక్ష్మణ్, నరేష్, రవి గౌడ్, వినోద్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# రైతును వంచించే 'తరుగు' దోపిడీని అరికట్టాలి: ఎమ్మెల్యే వేముల

**నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, తరుగు పేరుతో అన్నదాతలను నిలువుదోపిడీ చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో నెల రోజులుగా రోడ్లపైనే ఉన్న ధాన్యపు కుప్పలను ఆయన గురువారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల గోడు విన్న ఆయన వెంటనే జిల్లా పౌరసరఫరాల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిలదీశారు. చౌట్‌పల్లి వంటి పెద్ద గ్రామాల్లో ధాన్యం రాశులు గుట్టలుగా ఉన్నా, కేవలం మూడు లారీలనే కేటాయించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. 75 మంది రైతులు విక్రయం కోసం ఎదురుచూస్తుంటే, కేవలం 25 మందికే టోకెన్లు ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. క్వింటాల్‌కు 44 నుండి 45 కిలోల వరకు తరుగు తీస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా, కలెక్టర్ నిర్ణయించిన 41.5 కిలోల కంటే ఒక్క గ్రాము కూడా అదనంగా తీసుకోనిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిసిన వాహనాలను వెంటనే చౌట్‌పల్లి, బషీరాబాద్ కేంద్రాలకు మళ్లించి, అకాల వర్షాల ముప్పు నుండి రైతులను కాపాడాలని సూచించారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు పూర్తి చేయాలని, చివరి గింజ కొనే వరకు రైతుల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని వేముల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# పార్టీ ద్రోహులకు పదవులా..... డీసీసీ సెక్రటరీ ఎల్మ వినయ్ రెడ్డి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 14(డి డి 9వార్త ):-**

గతం లో ఎమ్మెల్యే ఎన్నికలు కాని ఎంపీ ఎన్నికలు మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కుడా పార్టీ కి వ్యతిరేకంగా పని చేసిన ద్రోహులకు పదవులు కట్టబెట్టడం పై కార్యకర్తల ఆగ్రహం...

ఒక్కరోజు కూడా పార్టీ కార్యక్రమం లో పాల్గొనకుండా పైరవీలు చేసుకొని పదవులు పొందడం ఏంటని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ప్రశ్నిస్తున్నారు.... జిల్లా అధ్యక్షులు అసలు పార్టీ ద్రోహులకు పదవులు ఎలా కట్టబెట్టారో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.బోథ్ కన్వీనర్ గా నియమించబడిన వ్యక్తి మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి పని చేసి కన్న తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ కి ద్రోహం చేసిన వ్యక్తి అలాంటి వ్యక్తిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ ధన్నూర్ గ్రామ కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు సంతకాలు సేకరణ చేసి మరి సదరు వ్యక్తి ని పార్టీ నుండి సస్పెండ్ చేయాలనీ జిల్లా అధ్యక్షులు కి చెప్పిన వినకుండా ఇవ్వాలా ఏకంగా పార్టీ ద్రోహి కే కన్వీనర్ పదవి కట్టబెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే జిల్లా అధ్యక్షులు పార్టీ ద్రోహులని పదవి నుండి తొలగించి నిజమైన కార్యకర్తకి పదవి కట్టబెట్టాలని లేని యెడల ఈ విషయం గురించి పీసీసీ అధ్యక్షులు గారిని జిల్లా ఇంచార్జి మంత్రి ని కలిసి వివరిస్తామని ఆఖరికి గాంధీ భవన్ ఎదుట బైటయించడానికి అయిన సిద్ధం అని అవసరమైతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం సిద్ధమని హెచ్చరించారు.

# బోథ్ మండలకాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా నల్ల శ్రీకాంత్ రెడ్డి నియామకం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 14(డి డి 9వార్త ):**



మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గా మండలంలోని దన్నూర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీకాంత్ రెడ్డిని నియమిస్తూ డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.. గత పది సంవత్సరాల కాలంగా మండల పార్టీ కన్వీనర్ పోస్టులు భర్తీ చేయకుండా ఇన్చార్జిలుగా నియమిస్తూ వచ్చారు. చివరికి ఎట్టాకేలకు కన్వీనర్ లనియామకం చేపట్టడంతో పార్టీ పటిష్టతకు దోహదపడే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అంటున్నారు. మండల కన్వీనర్ గా బాధ్యతలు చేపట్టిన వారు పార్టీ పటిష్టత కోసం పాటుపడాలని జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్.ప్రవేశాలకై దరఖాస్తుకు ఆహ్వానం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 14(డి డి 9వార్త ):-**


మీ పిల్లల భవిష్యత్తును నిర్మించుటకై, వారి బంగారు భవితకు బాటలు వేసుకోవడానికి కళాశాల, బోథ్ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికై ఆహ్వానం పలుకుతున్నది. MPC, B.P.C., CEC. ACE. గ్రూపులలో ప్రవేశాలు స్వీకరించబడుతున్నవి. ప్రతి గ్రూపులో 40 సీట్లు కలవు.ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా. 5. అనురాధ గారు ఓ ప్రకటనలో తెలియజేశారు.పదవ తరగతి మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపుజరుగుతాయి.దరఖాస్తు ప్రారంభం 15052026 నుండి 25052026 వరకు స్వీకరించబడతాయి.ఎంపిక కాబడిన అభ్యర్థుల లిస్టు 27052026 న ప్రకటించబడును.ఎంపిక కాబడిన అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన 28052026 నుండి 30052026 వరకు జరుపబడును. (రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది.) కళాశాల ప్రారంభ తేది మరియు తరగతుల నిర్వహణ01062026 నుండి.దరఖాస్తుదారులు మొబైల్ ద్వారా గాని లేదా మీ సేవ tgms. telangana.gov.in చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు.




# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌కు ఘన సన్మానం

**నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ నూతన చైర్మన్ పదవీ స్వీకార మహోత్సవం గురువారం హైదరాబాద్‌లోని నాగోల్ బండ్లగూడ వసంత్ విహార్ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఇందూరు బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రాష్ట్ర బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కోలవి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో తరలివచ్చిన ఇందూరు బ్రాహ్మణ సంఘ సభ్యులు.. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ బస్వారాజ్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం ప్రసాద్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం పరిషత్ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు అందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇందూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కొలవి అశోక్ కుమార్, నాగరాజు శర్మ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొని నూతన పాలకమండలికి అభినందనలు తెలిపారు.






## సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- **పీఓడబ్ల్యూ డిమాండ్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనప్పటికీ అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో ఆందోళన చేపట్టారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన నిరసనలో సంఘం నాయకులు ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి మాట్లాడుతూ.. నిందితుడు కేంద్ర మంత్రి కుమారుడు కావడమే అరెస్టు చేయకపోవడానికి కారణమని మండిపడ్డారు. అరెస్టులో జాప్యం చేస్తూ సెక్షన్లను మార్పు చేయడం ద్వారా నిందితుడిని బెయిల్‌పై బయటకు తీసుకువచ్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ముందు అందరూ సమానమేనని, కానీ ఈ కేసులో 17 ఏళ్ల మైనర్ బాలిక కుటుంబానికి అన్యాయం చేసేలా అధికార బలంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నైతిక బాధ్యత వహించి బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వం ఆయన్ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు బీపాషా బేగం, కళావతి, లక్ష్మి, సాయవ్వ, రెహానా బేగం, శోభ, సుగుణ, రాణి, గంగామణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**



బోధన్ కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బందిపై దాడికి పాల్పడిన సర్దార్ సింగ్ చౌహన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోర్టు ఆవరణలో వాహనం పక్కకు తీయాలని కోరిన సిబ్బంది నరేందర్‌పై సర్దార్ సింగ్ చౌహన్ దాడికి దిగడంతో స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడిని మేజిస్ట్రేట్ సాయి శివ ఎదుట హాజరుపరిచారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ వెంకట నారాయణ వెల్లడించారు



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలి

- **27,314 మంది రైతులు నుండి 1,20,125.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**
- **13099 రైతులకు 150.82 కోట్లు. రైతుల ఖాతాలలో జమ**
- **కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్ నిల్వలు లేకుండా చూడాలి**
- **అదనపు లారీలను వెంటనే ఏర్పాటు చేయాలి**
- **ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్**

**కౌడిపల్లి డీడీ9 వార్త:-**

మండల పరిధిలోని మమ్మద్ నగర్ గ్రామ శివారులో గల శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఆర్డీవో,డిఎం సిఎస్, డిఎస్ఓ,తాసిల్దార్ తో కలిసి అన్లోడింగ్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కౌడిపల్లి మండలం మమ్మద్ నగర్ గ్రామంలోని శ్రీనివాస ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లు ఆర్డీవో, డిఎం సిఎస్, డిఎస్ఓ, తాసిల్దార్ తో కలిసి అన్లోడింగ్ ను గోదాములను, సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వలు, లిఫ్టింగ్ పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 27,314 మంది రైతులు నుండి 1,20,125.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు 13099 రైతులకు 150.82 కోట్లు. రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేసినట్లు వివరించారు

నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 600 లారీలు ద్వారా ధాన్యం రవాణా వేగవంతంగా జరిగేందుకు ఆర్టీఓ శాఖ, రవాణా ఏజెన్సీలకు సూచించారు. కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, లిఫ్టింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, డి ఎం జగదీష్, తాసిల్దార్ కృష్ణ . తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- **మండల ప్రత్యేక అధికారి పద్మజ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇక్కడే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో జ్ఞానం లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి పద్మజ పేర్కొన్నారు. 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఆమె ఘనంగా సన్మానించారు. 6, 7, 8, 9 తరగతుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారితో పాటు, అత్యధిక హాజరు శాతం కలిగిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు వేదికలుగా నిలుస్తున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజూష మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, కంప్యూటర్ ల్యాబ్, ఐఎఫ్పీ ప్యానెల్ వంటి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వీటితో పాటు అగ్రి వొకేషనల్, ఐటీ వొకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యను కూడా అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో పాటు ఉపాధ్యాయులు విజయ్ కుమార్, సుధారాణి, స్వామి, అబ్బయ్య, సాయిలు, సంగీతరావు, సంతోష్ యాదవ్, రాజకుమార్, లక్ష్మి, విజయలక్ష్మి, జ్యోత్స్న, వనజ తదితరులు పాల్గొన్నారు.





## వికలాంగుల హామీలు అమలు చేయకుంటే పోరాటం తప్పదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వేళ వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ విమర్శించారు. గురువారం రెంజల్ మండల కేంద్రంతో పాటు బోర్గం గ్రామంలో ఎన్పీఆర్డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికలాంగుల సమస్యలపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని ప్రభుత్వాలు గద్దెనెక్కిన తర్వాత వారి సంక్షేమాన్ని విస్మరించాయని మండిపడ్డారు. గత ఎన్నికల హామీ మేరకు రూ. 5 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం సైతం రూ. 4,016 నుంచి రూ. 6,016కు పెంచుతామన్న మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. అర్హులైన ప్రతి వికలాంగుడికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని, ఇళ్ల స్థలం లేని వారికి స్థలం కేటాయించి నిర్మాణం కోసం కేంద్రం రూ. 5 లక్షలు, రాష్ట్రం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రుణాలు లేవు.. పరికరాల పంపిణీ అరకొరే వికలాంగులకు వ్యక్తిగత రుణాల మంజూరు ప్రక్రియ రెండేళ్లుగా అడుగు ముందుకు పడలేదని గంగాధర్ పేర్కొన్నారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల్లో కొద్దిమందికి మాత్రమే స్కూటీలు, ఇతర పరికరాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని, ఇంకా వేలాది మంది అర్హులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలం నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నేటికీ మోక్షం కలగలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ పెన్షన్లు, నివేశన స్థలాలు, రుణాల మంజూరు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులు, వృద్ధులు, వితంతువులను ఏకం చేసి ప్రభుత్వంపై ఉధృత పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, సహాయ కార్యదర్శి లకన్ సింగ్, జిల్లా నాయకులు ఒడ్డెన్న, రెంజల్ మండల నాయకులు నక్క సాయిలు, లస్కిన్ సాయిలు, గొల్ల పోతున్న, వేదాన్స్, అబ్బన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బోథ్ లో ఘనంగా జరిగిన సామూహిక శివ అష్టోత్తర సహస్రనామ భస్మార్చన

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్, మే 14(డి డి 9 వార్త ):-**

బోథ్ పట్టణంలోని మైసమ్మగల్లిలో ఉన్న కేదారేశ్వర దేవాలయంలో గురువారం సాయంత్రం భక్తి భావంతో సామూహిక శివ అష్టోత్తర సహస్ర నామ భస్మార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని శ్రీ ఆది శంకరాచార్య భగవాన్ నామ సంకీర్తన మండలి, పనుగుట్ట నందిపేట్ మహారాజ్ గారి ఆధ్వర్యంలో కేదారేశ్వర దేవాలయ కమిటీ ధార్మిక సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేశారు.

కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పార్వతి పరమేశ్వరుల ఆశీస్సులు పొందారు. సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్న భక్తులు శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని భక్తిమయంగా మార్చారు.

ఈ సందర్భంగా స్వామీజీ ప్రవచనం అందిస్తూ కలియుగంలో మట్టి లింగ పూజకు విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. హిందూ సనాతన సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, ఆలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పండుగలను ఆధ్యాత్మిక భావనతో జరుపుకోవాలని సూచించారు. ఆధునిక సంస్కృతి పేరుతో హిందూ ఆచారాలను నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి ఇంట్లో భగవన్నామ జపం, దీపారాధన, పూజలు కొనసాగించాలని భక్తులకు పిలుపునిచ్చారు. అలాగే వినాయక చవితి, దుర్గాష్టమి వంటి పండుగలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి సనాతన ధర్మాన్ని కాపాడడం ప్రతి హిందువు బాధ్యత అని స్వామీజీ తెలిపారు.

ఈ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.







# ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 14(డీడీ9 వార్త) :**

బోధన్ నుంచి నాందేడ్ కు సుమారు 40 మంది ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సుకు సాలూర మండల కేంద్రం వద్ద పెను ప్రమాదం తప్పింది. సాలూర మండల శివారులోని ఇండియా పెట్రోల్ బంక్ సమీపానికి చేరుకోగానే, రోడ్డు పక్కన ఉన్న ఒక పెద్ద చెట్టు ఒక్కసారిగా విరిగి బస్సుపై పడబోయింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించి వెంటనే హ్యాండ్ బ్రేక్ వేయడంతో బస్సు అక్కడికక్కడే ఆగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ పెను ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడగా, ఒక్కరికి మాత్రమే స్వల్ప గాయాలైనట్లు సమాచారం. డ్రైవర్ అప్రమత్తతతో పెద్ద ప్రాణాపాయం తప్పడంతో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



## ఆటలో బంగారు గొలుసు కిందపడేసుకున్న ఆర్సీబీ బ్యాటర్...

- ఔటయ్యే క్రమంలో పిచ్‌పై గోల్డ్ చైన్ పడేసుకున్న జాకబ్ బెతెల్
- గమనించకుండా వెళ్లిపోగా, తర్వాత వచ్చిన పడిక్కల్ దానిని తిరిగిచ్చాడు
- సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఘటన
- ఈ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీతో కేకేఆర్‌పై ఆర్సీబీ ఘన విజయం

**డిడి9 వార్త:**

ఐపీఎల్ లో గత రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఆర్సీబీ ఓపెనర్ జాకబ్ బెతెల్ ఔటయ్యే క్రమంలో తన బంగారు గొలుసును పిచ్‌పైనే జారవిడుచుకుని, అది గమనించకుండానే పెవిలియన్‌కు వెళ్లిపోయాడు.

రాయ్‌పూర్ లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ బౌలర్ కార్తిక్ త్యాగి వేసిన బౌన్సర్‌ను బెతెల్ పుల్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే బంతి హెల్మెట్‌కు తగిలి గాల్లోకి లేవగా, త్యాగి సులభంగా క్యాచ్ అందుకున్నాడు. ఈ క్రమంలోనే అతని మెడలోని గోల్డ్ చైన్ తెగి పిచ్‌పై పడిపోయింది. కానీ ఔటయ్యానన్న నిరాశలో ఉన్న బెతెల్ ఈ విషయాన్ని గమనించలేదు.

అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన దేవదత్ పడిక్కల్ పిచ్‌పై మెరుస్తున్న చైన్‌ను చూశాడు. వెంటనే దానిని చేతిలోకి తీసుకుని అంపైర్‌కు అప్పగించి తన క్రీడాస్ఫూర్తిని చాటుకున్నాడు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, నెటిజన్లు సరదా కామెంట్లతో స్పందించారు. పడిక్కల్ స్పోర్ట్స్‌మన్‌షిప్‌ను పలువురు ప్రశంసించారు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే, ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో కేకేఆర్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 192 పరుగులు చేయగా, ఆర్సీబీ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విరాట్ కోహ్లీ (105*) అజేయ సెంచరీతో చెలరేగి జట్టును గెలిపించాడు. ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది 9వ సెంచరీ. ఈ మ్యాచ్‌లో బెతెల్ 15 పరుగులు చేశాడు.



## ఆట ముగిసే రోజు వస్తుంది.. అందుకే ప్రతి క్షణం ఆస్వాదిస్తున్నా

- కేకేఆర్‌పై సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీ
- విరాట్ శతకంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఆర్సీబీ
- వరుస డకౌట్ల తర్వాత శతకంతో ఫామ్‌లోకి వచ్చిన కింగ్
- రికార్డుల కోసం కాదు, ఆటను ఆస్వాదించడానికే ఆడుతున్నానన్న కోహ్లీ
- ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా కొత్త రికార్డ్

**డిడి9 వార్త:**

రాయ్‌పూర్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుత శతకంతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో పలు రికార్డులు బద్దలుకొట్టినా, మ్యాచ్ అనంతరం ఆయన పలికిన మాటలు అభిమానుల హృదయాలను గెలుచుకున్నాయి. రికార్డులు, మైలురాళ్లపై తనకిక ఆసక్తి లేదని, క్రికెట్‌లో మిగిలి ఉన్న ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నానని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) స్టార్ విరాట్ కోహ్లీ స్పష్టం చేశాడు. ఈ విజయంతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో తిరిగి అగ్రస్థానానికి చేరింది.

ఈ మ్యాచ్‌లో కోహ్లీ కేవలం 60 బంతుల్లో 105 పరుగులు చేసి అజేయంగా నిలిచి, ఆర్సీబీకి ఆరు వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 14,000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా, ఐపీఎల్ చరిత్రలో 279 మ్యాచ్‌లతో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా క్రిస్ గేల్‌ను అధిగమించి కొత్త రికార్డు సృష్టించాడు.



మ్యాచ్ అనంతరం కోహ్లీ మాట్లాడుతూ "ఇన్నేళ్ల తర్వాత కూడా నాకు బ్యాటింగ్ అంటే అమితమైన ఇష్టం. ఈ స్థాయిలో ఆడటం, ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో పోటీపడటం ఎంతో గౌరవంగా ఉంది. నా జీవితంలో నేను చేసిందల్లా ఇదే. క్రికెట్‌ను నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను" అని అన్నాడు. ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన 37 ఏళ్ల కోహ్లీ, తన కెరీర్ ముగింపు గురించి ఆలోచిస్తున్నానని అంగీకరించాడు. "ఒకరోజు నా కెరీర్ ముగుస్తుంది. అందుకే మైదానంలో ఉన్న ప్రతిరోజూ పూర్తిస్థాయిలో ఆస్వాదించాలనుకుంటున్నాను. ఒత్తిడిని కూడా ఆస్వాదిస్తూ ముందుకు సాగుతాను" అని వివరించాడు.

**ఒత్తిడిని జయించి..**

వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌట్ కావడంతో కేకేఆర్‌తో మ్యాచ్‌కు ముందు కోహ్లీపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. అయితే, ఈ వైఫల్యాలే తనను తిరిగి సరైన మార్గంలోకి నడిపించాయని కోహ్లీ తెలిపాడు. ఈ మ్యాచ్‌లో 21 పరుగుల వద్ద రోవ్‌మన్ పావెల్ క్యాచ్ వదిలేయడంతో కోహ్లీకి జీవనదానం లభించింది. ఆ తర్వాత వెనుదిరిగి చూడని కోహ్లీ, కేవలం 32 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసి, ఆపై శతకంతో జట్టును గెలిపించాడు. ఇన్నింగ్స్‌లో తొలి పరుగు సాధించగానే గాల్లోకి పంచ్ విసురుతూ నవ్వుకోవడం, డకౌట్ల ఒత్తిడిని అధిగమించినందుకు సూచికగా నిలిచింది.

ఈ విజయంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ 16 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచి, ప్లేఆఫ్స్‌లో టాప్2 స్థానాన్ని ఖాయం చేసుకునే దిశగా అడుగులు వేసింది. మరోవైపు, అంగ్‌క్రిష్ రఘువంశీ (71) రాణించినా, కేకేఆర్ ఓటమితో వారి ప్లేఆఫ్ ఆశలు సంక్లిష్టంగా మారాయి. ఈ ఓటమి వారి నాలుగు మ్యాచ్‌ల విజయాల పరంపరకు తెరదించింది.

## ముగ్గురు కెప్టెన్లపై వేటుకు వేళాయే?

- ఐపీఎల్‌లో వరుస వైఫల్యాలు.. ముగ్గురు కెప్టెన్లపై వేటుకు రంగం సిద్ధం
- ఢిల్లీ సారథిగా అక్షర్ పటేల్ విఫలం.. బ్యాటింగ్, బౌలింగ్‌లో పేలవ ప్రదర్శన
- లక్నోను గెలిపించలేకపోతున్న పంత్.. కెప్టెన్సీ భారం, ఫామ్ కోల్పోయిన వైనం
- కేకేఆర్‌కు భారంగా మారిన రహానే.. తక్కువ స్ట్రైక్ రేట్‌తో జట్టుకు నష్టం
- తదుపరి సీజన్‌లో వీరి కెప్టెన్సీ కొనసాగడంపై నెలకొన్న అనుమానాలు



**డిడి9 వార్త:**

ఐపీఎల్ ప్రస్తుత సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, మూడు ఫ్రాంచైజీలలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వరుసగా రెండు సీజన్లలో జట్లను ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో దారుణంగా విఫలమైన ముగ్గురు కెప్టెన్ల పదవులకు గండం ఏర్పడింది. ఈ నెలాఖరులో సీజన్ ముగిశాక అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తమ కెప్టెన్సీలను కోల్పోవడం ఖాయమని ఫ్రాంచైజీ వర్గాల సమాచారం.

లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో వరుసగా రెండుసార్లు విఫలమైన కెప్టెన్‌గా రిషభ్ పంత్ ముందున్నాడు. ఇక అజింక్యా రహానే నేతృత్వంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) కూడా దాదాపుగా రేసు నుంచి తప్పుకున్నట్లే. ఈ నేపథ్యంలో వీరి కెప్టెన్సీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**సారథిగా, ఆటగాడిగా విఫలమైన అక్షర్ పటేల్**

ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ప్రదర్శన అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో కేవలం 112.50 స్ట్రైక్ రేట్‌తో 100 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఇన్నింగ్స్‌లో 56 పరుగులు రాగా, మిగిలిన 8 ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 44 పరుగులే చేయడం అతని వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. బౌలింగ్‌లోనూ 12 మ్యాచ్‌లలో 36 ఓవర్లు వేసి 10 వికెట్లు పడగొట్టాడు. ఎకానమీ రేటు (8.08) పర్వాలేదనిపించినా, కీలక సమయాల్లో తనకు తాను తక్కువగా బౌలింగ్ అవకాశాలు ఇచ్చుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

వచ్చే సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్య బాధ్యతలు జీఎంఆర్ నుంచి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌కు బదిలీ కానున్నాయి. అక్షర్ నాయకత్వ పటిమను నిరూపించుకోవడంలో విఫలమవ్వడం, కీలక నిర్ణయాల కోసం కోచింగ్ సిబ్బంది హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావులపై ఆధారపడటం వంటి కారణాలతో వచ్చే ఏడాది అతను కెప్టెన్‌గా కొనసాగడం అసాధ్యమని ఐపీఎల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అభిషేక్ పోరెల్ వంటి ప్రతిభావంతుడిని పక్కనపెట్టడం, మాధవ్ తివారీ వంటి ఆల్‌రౌండర్‌ను సరిగ్గా ఉపయోగించుకోకపోవడం వంటి నిర్ణయాలు కూడా అతని కెప్టెన్సీకి మైనస్‌గా మారాయి. 2027 మెగా వేలంలో ఆటగాడిగా అక్షర్‌ను అట్టిపెట్టుకున్నా, కెప్టెన్‌గా మాత్రం అవకాశం లేనట్లే.

**కెప్టెన్సీ భారంతో కుంగిపోతున్న పంత్**

రిషభ్ పంత్‌కు కెప్టెన్సీ సరిపడటం లేదనేది ఫ్రాంచైజీ క్రికెట్‌లో బహిరంగ రహస్యం. అతనిపై వేల టన్నుల భారం ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ సీజన్‌లో 11 మ్యాచ్‌లలో 138 స్ట్రైక్ రేట్‌తో కేవలం 251 పరుగులు చేసి, 9 సిక్సర్లు మాత్రమే కొట్టడం అతని పేలవ ఫామ్‌కు అద్దం పడుతోంది. లక్నో యజమాని సంజీవ్ గోయెంకా భారీ మొత్తం వెచ్చించి ఆటగాళ్లను కొనుగోలు చేస్తారు, కానీ అంతేస్థాయిలో ఫలితాలను ఆశిస్తారు. వరుసగా రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించకపోవడం ఆయనకు తీవ్ర అసంతృప్తిని కలిగించింది.

అర్షిన్ కులకర్ణి వంటి ఆటగాడిని ఓపెనర్‌గా పంపడం, దేశవాళీ టీ20లలో 130 కంటే తక్కువ స్ట్రైక్ రేట్ ఉన్న హిమ్మత్ సింగ్‌కు పదేపదే అవకాశాలివ్వడం, ఆయుష్ బదోనిని టాప్ ఆర్డర్‌లో ఆడించడం వంటి వ్యూహాత్మక తప్పిదాలు జట్టు వైఫల్యానికి కారణమయ్యాయి. నికోలస్ పూరన్, మార్క్‌రమ్ ఫామ్‌లో లేకపోవడం కూడా దెబ్బతీసినప్పటికీ, ఒక కెప్టెన్‌కు ఉండాల్సిన వ్యూహాత్మక చతురత పంత్‌లో లోపించిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**కేకేఆర్‌కు భారంగా మారిన రహానే**

కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సరైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో అజింక్యా రహానేకు కెప్టెన్సీ దక్కింది. అయితే అతని నిదానమైన బ్యాటింగ్ జట్టుకు శాపంగా మారింది. రహానే (237 పరుగులు, 133 స్ట్రైక్ రేట్), మరో టాప్ ఆర్డర్ బ్యాటర్ అంగ్‌క్రిష్ రఘువంశీ (340 పరుగులు, 139+ స్ట్రైక్ రేట్) ఇద్దరూ కలిసి దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు ఊపును దెబ్బతీశారు. ఈ ఇద్దరూ కలిసి 11 మ్యాచ్‌లలో కేవలం 25 సిక్సర్లు మాత్రమే కొట్టారంటే వారి బ్యాటింగ్ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 37 ఏళ్ల వయసులో టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగాన్ని అందుకోవడంలో రహానే విఫలమవుతున్నాడు. తన స్ట్రైక్ రేట్‌పై విమర్శలు వచ్చినప్పుడు జనాలకు అసూయ అంటూ వ్యాఖ్యానించిన రహానే, ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది.

మొత్తం మీద చూస్తే అక్షర్ పటేల్, రిషభ్ పంత్‌లకు ఆటగాళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ, వచ్చే మినీ వేలంలో రహానేను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ ముందుకు రాకపోవచ్చని అంచనా.

## తిలక్ వర్మకు కొత్త బాధ్యతలు.. కెప్టెన్‌గా ఎంపిక చేసిన బీసీసీఐ..

**డిడి9 వార్త:**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి రంగం సిద్ధం చేసింది. జూన్ 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ముక్కోణపు టీ20 సిరీస్ కోసం భారత్ 'ఎ' జట్టును అధికారికంగా ప్రకటించింది. ఈ టోర్నీలో భారత్ 'ఎ'తో పాటు శ్రీలంక 'ఎ', అఫ్గానిస్థాన్ 'ఎ' జట్లు తలపడనున్నాయి. యువ రక్తం, అనుభవజ్ఞులైన ప్రతిభావంతులతో కూడిన ఈ జట్టు ప్రకటన ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**కెప్టెన్‌గా తిలక్ వర్మ..**

ఈ సిరీస్ కోసం జట్టు పగ్గాలను డాషింగ్ బ్యాటర్ తిలక్ వర్మకు అప్పగించారు. అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే తన సత్తా చాటిన తిలక్, ఈ టోర్నీలో జట్టును ముందుండి నడిపించనున్నాడు. అయితే.. అందరి దృష్టిని ఆకర్షిస్తున్న మరో పేరు వైభవ్ సూర్యవంశీ. కేవలం 13 ఏళ్ల వయస్సులోనే దేశవాళీ క్రికెట్‌లో రికార్డులు సృష్టించిన ఈ కుర్రాడు, భారత్ 'ఎ' జట్టులోకి ఎంపికవ్వడం ఒక అద్భుతం. అతని బ్యాటింగ్ శైలిని విశ్లేషకులు భవిష్యత్తు ఆశాకిరణంగా అభివర్ణిస్తున్నారు.

**జట్టు బలాబలాలు..**

జట్టులో భారీ హిట్టర్లకి కొదవలేదు. ఓపెనర్‌గా అభిషేక్ శర్మ విధ్వంసం సృష్టించడానికి సిద్ధంగా ఉండగా, మిడిల్ ఆర్డర్‌లో ఆయుష్ బదోని, రమణ్‌దీప్ సింగ్ వంటి ఫినిషర్లు ఉన్నారు. బౌలింగ్ విభాగంలోనూ వైవిధ్యం కనిపిస్తోంది. స్పిన్, పేస్ విభాగాల్లో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేశారు.

**టోర్నీ ప్రాముఖ్యత..**

ఈ ముక్కోణపు సిరీస్ కేవలం టైటిల్ కోసం మాత్రమే కాదు, భారత సీనియర్ జట్టులోకి వెళ్లేందుకు యువ ఆటగాళ్లకు ఇది ఒక బంగారు అవకాశం. ముఖ్యంగా శ్రీలంక, అఫ్గానిస్థాన్ జట్లు కూడా బలమైన 'ఎ' జట్లను పంపిస్తుండటంతో పోటీ అత్యంత రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. జూన్ 9 నుంచి ప్రారంభమయ్యే ఈ పోరులో మన కుర్రాళ్లు ఏ మేరకు రాణిస్తారో చూడాలి.



## ఆఫ్ఘన్ క్రికెటర్ జాద్రాన్ ప్రాణాంతక వ్యాధితో పోరాటం... పరామర్శించిన సహచరులు

- గ్రేటర్ నోయిడాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాద్రాన్
- పరామర్శించిన క్రికెటర్లు రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ
- ఆసుపత్రిలోని చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న మహమ్మద్ నబీ

**డిడి9 వార్త:**

తీవ్ర అనారోగ్యంతో భారత్‌లో చికిత్స పొందుతున్న తమ దేశానికి చెందిన మాజీ క్రికెటర్ షాపూర్ జాద్రాన్‌ను ఆఫ్ఘనిస్థాన్ ప్రముఖ క్రికెటర్లు రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ నేడు పరామర్శించారు. హెమోఫాగోసైటిక్ లింఫోహిస్టియోసిస్ (హెచ్ఎల్‌హెచ్) అనే వ్యాధితో బాధపడుతున్న జాద్రాన్, గ్రేటర్ నోయిడాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జాద్రాన్‌ను పరామర్శించిన అనంతరం, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగ పోస్టును పెట్టారు. ఆసుపత్రిలోని చిత్రాలను పంచుకున్నారు. గ్రేటర్ నోయిడాలో చికిత్స పొందుతున్న జాద్రాన్‌ను తాను, రషీద్ ఖాన్ కలిశామని మహమ్మద్ నబీ పోస్టులో పేర్కొన్నాడు. నా ప్రియమైన సోదరుడు అరుదైన వ్యాధితో ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడ అని నబీ పేర్కొన్నాడు. మైదానంలో ఉంటే ఎలాంటి పోరాట పటిమను ప్రదర్శించేవాడో ఇప్పుడు జీవితంలో వ్యాధిపై అంతే ధైర్యంగా పోరాడుతున్నాడని తెలిపాడు. ఆసుపత్రి బెడ్ మీద




అతనిని చూడటం బాధగా ఉందని భావోద్వేగానికి లోనయ్యాడు. అతడు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని పేర్కొన్నాడు. జాద్రాన్ 44 వన్డేలు, 36 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ 38 ఏళ్ళ పేసర్ రెండు ఫార్మాట్‌లలో 80 వికెట్లు పడగొట్టాడు. 2020లో ఆఫ్ఘన్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు.

# సాయి పల్లవికి షాకిచ్చిన ‘రామాయణ’ టీమ్!



నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ‘రామాయణ’. ఈ సినిమాలో సీతగా నటిస్తున్న సాయి పల్లవి గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆమె పోషిస్తున్న పాత్రకు మేకర్స్ డబ్బింగ్ ఆర్టిస్ట్‌ను వినియోగించాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల సాయి పల్లవి హిందీలో నటించిన ఫస్ట్ సినిమా ‘ఏక్ దిన్’. ఇందులో జునైద్ ఖాన్ సరసన నటించగా.. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఈ సినిమాలో సాయి పల్లవి హిందీ డైలాగ్ డెలివరీ, ఆమె స్లాంగ్ పై నెటిజన్ల నుంచి కొంత విమర్శలు వచ్చాయి.పౌరాణిక చిత్రమైన ‘రామాయణ’లో భాష చాలా స్వచ్ఛంగా, స్పష్టంగా ఉండాలి. కాబట్టి సాయి పల్లవి హిందీ యాస సీత పాత్రలోని దైవత్వానికి లేదా గాంభీర్యానికి సరిపోకపోవచ్చని కొందరు అభిప్రాయ పడుతున్నారట. సాయి పల్లవి తన పాత్రలకు తానే డబ్బింగ్ చెప్పుకోవడానికి ఇష్టపడుతుంది. అయితే, సినిమా నాణ్యత, పాత్ర స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని మేకర్స్ తీసుకున్న ఈ నిర్ణయం సాయి పల్లవి షాక్ అనే చెప్పాలి. అందుకు సాయి పల్లవి కూడా ఒప్పుకున్నట్లు టాక్. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ భారీ చిత్రం మొదటి భాగం 2026 దీపావళి కానుకగా విడుదల కానుంది. రణబీర్ కపూర్ రాముడు, సాయి పల్లవి సీత, యష్ రావణుడు, సన్నీ డియోల్ హనుమంతుడు వంటి పాత్రలో కనిపించబోతున్నారు.

# దర్శకుడుగా హీరో రామ్..



తెలుగు సినీ పరిశ్రమలో ‘ఎనర్జిటిక్ స్టార్’గా తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న హీరో రామ్ పోతినేని (RAPO). ‘దేవదాసు’ హీరోగా మొదలైన రామ్ ప్రయాణం.. తనదైన నటనతో, చలాకీతనంతో, అదిరిపోయే డాన్సులతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకునేలా చేసింది. అయితే, ఇన్నాళ్లూ తన నటనతో కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్.. ఇప్పుడు తన కెరీర్‌లో ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఇకపై కేవలం హీరో మాత్రమే కాదు.. దర్శకుడు కూడా! రామ్ హీరోగా నటిస్తున్న 23వ చిత్రం (#RAPO23)కి సంబంధించి అభిమానులకు ఒక పవర్‌ఫుల్ అప్‌డేట్ సిద్ధమైంది. ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. కెమెరా ముందు యాక్షన్ చేస్తూనే, కెమెరా వెనుక ‘యాక్షన్’ చెప్పబోతున్నారు. రామ్ సినీ ప్రయాణంలో ఇదొక పవర్‌ఫుల్ టర్న్ అని చెప్పాలి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు (మే 15వ తేదీ) ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. రామ్ స్వయంగా తానొక దర్శకుడిగా మారాను అనే విషయాన్ని రేపు అధికారికంగా ప్రకటించనున్నారు.

రామ్ ఉన్నట్టుండి మెగాఫోన్ పట్టుకున్నారు? అయితే వెనుక ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. వాస్తవానికి రామ్ గతంలో తన కోసం తానే ఓ పవర్‌ఫుల్ స్టోరీని రాసుకున్నారు. కథ అయితే సిద్ధమైంది కానీ, దాన్ని తాను ఊహించిన విధంగా, ఆ కథలోని ఎమోషన్‌ను పర్ఫెక్ట్‌గా స్క్రీన్‌పై ప్రెజెంట్ చేయగల దర్శకుడి కోసం ఆయన చాలా కాలం పాటు వేట సాగించారు. పలువురు దర్శకులను సంప్రదించినప్పటికీ, తన కథను తాను అనుకున్న స్థాయిలో డీల్ చేయగల దర్శకుడు ఆయనకు దొరకలేదట. తన కథలోని ఆత్మను పూర్తిగా అర్థం చేసుకున్న వ్యక్తి తానే కావడంతో, చివరకు ఆ బాధ్యతను తన భుజాలపైనే వేసుకోవాలని రామ్ గట్టి నిర్ణయించుకున్నారు.

# మిషన్ మంగళ్ దర్శకుడితో?





‘కర’ సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించారు తమిళ హీరో ధనుష్. దర్శకుడిగా, నటుడిగా భిన్నమైన కథలతో ప్రయాణిస్తున్న ఈయన ఖాతాలో ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఓ చిత్రం ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ధనుష్ జాబితాలో మరో చిత్రం చేరినట్లు తెలుస్తోంది. ‘మిషన్ మంగళ్’ చిత్రంతో మంచి హిట్‌ను అందుకున్న బాలీవుడ్ దర్శకుడు జగన్ శక్తితో ఆయన ఓ సినిమా కోసం చేతులు కలిపినట్లు సమాచారం. ప్రస్తుతం జగన్ శక్తి.. అజయ్ దేవగన్ నటిస్తున్న ‘రేంజర్’ సినిమాతో బిజీగా ఉన్నారని, ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యాక దీనికి సంబంధించిన స్క్రిప్ట్ పనుల్ని మొదలు పెట్టనున్నారని ధనుష్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



టాలీవుడ్ యంగ్ అండ్ సెన్సేషనల్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ప్రస్తుతం వరుస అవకాశాలతో ఇండస్ట్రీలో క్రేజీ బ్యూటీగా మారింది. ‘మిస్టర్ బచ్చన్’ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ భామ, ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా తన గ్లామర్, నటనతో దర్శకనిర్మాతలను మెస్మరైజ్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, రామ్ పోతినేని, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోలతో నటించిన సరైన హిట్ అందుకోలేకపోయింది. అయినప్పటికీ వరుస అవకాశాలు దక్కించుకుంటోంది.ప్రస్తుతం స్టార్ హీరో శివకార్తికేయన్ సరసన ‘సెయాన్’ చిత్రంతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెడుతోంది. అలాగే అక్కినేని అఖిల్ సరసన ‘లెనిన్’ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం వేగంగా జరుగుతోంది. దీనిని జూన్ 26న విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న భాగ్యశ్రీ తాను పని చేసిన ప్రతి హీరో నుంచి ఏదో ఒక విషయాన్ని నేర్చుకున్నానని తెలిపింది. “మాస్ మహారాజా నుంచి సహనం, షూటింగ్ సెట్స్‌లో ఆయన చూపించే అంతులేని ఎనర్జీని చూసి ఆశ్చర్యపోయా. ఇక విజయ్ దేవరకొండకు సినిమాపై ఉన్న ప్యాషన్, ప్రతి సీన్‌ను పర్ఫెక్ట్‌గా చేయాలనే ఆయన తపన నను ఎంతగానో ప్రభావితం చేశాయి. రామ్ కేవలం స్టార్ హీరో మాత్రమే కాదు, అద్భుతమైన డ్యాన్సర్. ప్రతి షాట్ కోసం ఆయన పెట్టే డెడికేషన్ నుంచి చాలా విషయాలు గ్రహించాను. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఇక దుల్కర్ సల్మాన్ ఇప్పటికే సీనియర్ నటుడైనప్పటికీ, ప్రతి సన్నివేశాన్ని ఒక కొత్త నటుడిలా ఆసక్తిగా గమనించడం ఆయన గొప్పతనం” అని ప్రశంసలు కురిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## ఆయన నుంచి ఎన్నో విషయా నేర్చుకోవచ్చు..

# ఇష్టపడకపోతే.. మరింత కష్టపడతా!



నాతో మంచి స్నేహం కుదరాలంటే కనీసం నాలుగుసార్లు అయినా కలిసి మాట్లాడాలి అంటోంది బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్. అంతేకాదు కెరీర్‌లో నెగిటివిటీని పట్టించుకోకుండా.. ప్రేక్షకులు ఆదరించే వరకు కష్టపడతానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. “మీరు నన్ను రెండు, మూడు సార్లు కలిసినప్పుడు నేను మీకు నచ్చకపోవచ్చు. కానీ, మనం నాలుగోసారి కలిస్తే కచ్చితంగా స్నేహితులవుతాం. నా జీవితంలోనే ఒక ఫిల్టర్ సిస్టమ్ ఉన్నట్లుంది. అందుకేనేమో నేను మీకు నచ్చాలంటే నాలుగుసార్లు అయినా కలవాలి. నా కెరీర్ ప్రారంభంలోనే ప్రేక్షకుల నుంచి చాలా ప్రేమ లభించింది. ‘కేదార్‌నాథ్’, ‘సింబా’ విడుదల తర్వాత రాత్రికి రాత్రే ఫేమ్ సాధించడంతో తొలినాళ్లలోనే అమ్మ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నేను కూడా నిజాయతీతో పనిచేస్తే ప్రేక్షకులు ప్రేమతో ఆదరిస్తారని అప్పుడే తెలుసుకున్నా. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ముందుకు సాగిపోవాలనుకున్నా. నెగిటివిటీని అస్సలు పట్టించుకోను. నా దృష్టిలో ఎలాంటి నెగిటివిటీ ఎదురైనా చివరికి పనే మాట్లాడుతుందని భావిస్తాను. ఒకవేళ ప్రేక్షకులు నన్ను ఇష్టపడకపోతే మరింత కష్టపడతాన”ని అంది. ‘పతి పత్నీ ఔర్ వోదో’ చిత్రంతో ఈ నెల 15 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది సారా.

## శర్వానంద్‌శ్రీనువైట్ల సినిమాలో

# హీరోయిన్‌గా క్రేజీ బ్యూటీ!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ‘బైకర్’ చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఇప్పుడు ‘భోగి’ అనే యాక్షన్ డ్రామాతో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే శర్వానంద్ తన తదుపరి ప్రాజెక్టును టాలీవుడ్ సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో ఖరారు చేయడం విశేషం. శ్రీనువైట్ల మార్క్ కామెడీకి, విభిన్నమైన టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌ను జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది. వినోదానికి సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జులై 2026 నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే సంక్రాంతి కానుకగా సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ సరసన నటించే హీరోయిన్ విషయంలో గత కొన్ని రోజులుగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొదట పూజా హెగ్డే, మమిత బైజు వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం.. మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు టాలీవుడ్ టాక్. ఇటీవల ‘కపుల్ ఫ్రెండ్లీ’ సినిమాతో తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మానస, ఇప్పుడు శర్వానంద్ లాంటి స్టార్ పక్కన నటించే అవకాశం దక్కించుకుంది. శర్వానంద్‌మానస జోడీ వెండితెరపై ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. శ్రీనువైట్ల తనదైన శైలిలో కామెడీని పండిస్తూనే, సైన్స్ ఫిక్షన్ లాంటి కొత్త జోనర్‌ను టచ్ చేస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ తుది దశలో ఉందని సమాచారం.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 617, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 23-SP, SY NO 417, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.